**సూరిబాబుకి విపరీతమైన నెర్వస్‌గా వుంది. అతనేమీ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్లబోవడం లేదు. అతని పరీక్షల రిజల్ట్స్ ఈ రోజు రావడం లేదు. అధమపక్షం అతను టీవీ సీరియల్‌లోనైనా నటించబోవడం లేదు. అయినా అతను మరి ఎందుకు అంత నెర్వస్‌గా వున్నాడూ అని అడిగితే 'ఈ రోజు అతని శోభనం రోజు కావడం వలన' అనే సమాధానానికి మీలో చాలామంది నవ్వితే నవ్వొచ్చు గాక!**

ఆ రోజు ఉదయం నుంచే సూరిబాబు స్నేహితులంతా అతనికి ధైర్యం చెబుతూ, ఉత్సాహపరుస్తూ, ఉచిత సలహాలు పారేస్తూ కొన్ని వందల ఏళ్ల నుండి ప్రతి శోభనపు పెళ్లికొడుకు మీద వేయబడుతున్న పాత జోకులన్నీ సూరిబాబు మీద కూడా వేస్తూ హడావిడి చేస్తూనే వున్నారు. అయినా వాళ్లెవరినీ సూరిబాబు ధైర్యంగా తన మనసులో వున్న సందేహాన్ని తీర్చమని అడగలేకపోయాడు. అందుకే ఇప్పుడు శోభనం గదిలో కూర్చుని కూడా నుదిటికి పట్టిన చెమటని తుడుచుకుంటూ ఆలోచిస్తున్నాడు.

ఇప్పుడో, ఇంకాసేపటికో తన 'భార్య' (గమ్మత్తుగా వుంది అలా అనుకోవడం) సీత - పాల గ్లాసు పట్టుకుని వస్తుంది. కానీ ఎంతకీ ఈ సమస్య తేలడంలేదు. ఎలా???

ఇంతకీ సూరిబాబుకి వచ్చిన సమస్య ఏమిటంటే- సీత పాలగ్లాసుతో లోపలికి వచ్చి తలుపు దగ్గర నించోగానే తనామెను ఎలా పలుకరించి ఎలా రిసీవ్ చేసుకోవాలా అనేది.

'ఛీ ఛీ! లవ్ మ్యారేజి చేసుకుని వున్నా బాగుండేది. ముందే కాస్త పరిచయం వుంటే పరిస్థితి ఇంతగా ఇబ్బంది వుండేది కాదు' చిరగ్గా అనుకున్నాడు సూరిబాబు.

మళ్లీ అంతలోనే - పెళ్ళయ్యాక మొదటి రాత్రి రోజునే పెళ్ళి గురించి పశ్చాత్తాప పడడం అంత మంచిది కాదనిపించి ఆ ఆలోచనని మనసులోంచి తుడిచేశాడు. (పశ్చాత్తాప పడేందుకు ముందు ముందు చాలా రోజులున్నాయన్న ఊహ మాత్రం సూరిబాబుకు రాలేదు.)

తను చదివిన నవలలు, చూసిన తెలుగు సినిమాలు అన్నీ ఒకసారి గుర్తు తెచ్చుకున్నాడు సూరిబాబు. అదే పద్ధతి ఫాలో అయితేనో?

సీత తలుపు దగ్గర నిలబడగానే తాను మంచం దగ్గిర నుంచి ఆమె దగ్గరకి హుందాగా (అదెలాగో?) నడిచి వెళతాడు. ఆమె వంగి తన పాదాలకు నమస్కరిస్తుంది. తానామెను చప్పున పైకి లేపి కళ్లలో ప్రేమను కురిపిస్తూ (కష్టమైన పనే!) ఆమె వంక చూస్తాడు. ఇద్దరూ మెల్లగా పాన్పు దగ్గరికి వస్తారు.

అంతా బాగానే వుంది కానీ - సీత కూడా తన లాగే డిగ్రీ చదివింది. పురాణకాలపు ఆడదానిలా ఆమె తన కాళ్లకు నమస్కరిస్తుందా?

ప్చ్! ఈ పద్ధతి లాభం లేదు.

పోనీ—

సీత దగ్గరకు వెళ్లి 'నేనంటే నీకు ఇష్టమేనా సీతా?' అని అడుగుతాడు. ఆమె సిగ్గుతో తల కొద్దిగా ఊపి 'ఊ' అంటుంది.

ఈ పద్ధతి గురించి ఒక నిమిషంపాటు ఆలోచించాడు సూరిబాబు. కానీ అంతకంటె తెలివితక్కువ ప్రశ్న ప్రపంచంలో ఇంకేదీ వుండదని కాస్త ఆలస్యంగా అర్థమై ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

పోనీ—

ఇలా అంటేనో?

"ఎంత అందంగా వున్నావు సీతా! దేవలోకం నుంచి



దిగి వచ్చిన అప్సరసలా వున్నావు."

ఊహు.

అచ్చంగా డ్రామా డైలాగులా వుంది. సీత తన మొహంమీదే నవ్వుతుందేమో?!

లేకపోతే ఇలా చేస్తే? —

సీత వచ్చి తలుపు దగ్గరే నిలుచుంటుంది. తాను మంచం మీద కూర్చునే "రా సీతా! అక్కడే ఆగిపోయావేం?" అంటూ పిలుస్తాడు.

ఇదీ నచ్చలేదు సూరిబాబుకి. పెద్ద 'లార్డ్' లాగా తాను కదలకుండా ఇక్కడే కూర్చుని ఆమెనే ఇక్కడికి రమ్మని ఆర్డర్ వెయ్యడం బాగోదనిపించింది.

ఎన్ని ఆలోచించినా ఏదో ఒక లోపం కనిపిస్తోంది. బుర్ర వేడెక్కిపోయి కళ్లు మూసుకుని కణతలు నొక్కుకుంటూ వుండిపోయాడు సూరిబాబు.

రెండు నిమిషాల తరువాత తన భుజం మీద చేయి చల్లగా స్పర్శించినట్లయి చప్పున కళ్లు తెరిచి ప్రక్కకు చూశాడు.

ఎప్పుడు వచ్చిందో ఏమో, తన ప్రక్కనే కూర్చుని వుంది సీత!

"ఏమిటండీ అలా వున్నారు? ఒంట్లో బాగోలేదా?"

కళ్లలో కరుణని, గొంతులో ప్రేమని నింపుకుని దయగా అడిగిందామె.

సూరిబాబు ఆమె వంక ఓ క్షణం చూశాడు.

ఒక మెత్తని చిరునవ్వు నవ్వి ఆమె భుజం చుట్టూ చెయ్యివేసి ఆమె నుదుటిపై తన పెదవులతో అంటి అంటనట్టుగా ఓ సుకుమారమైన ముద్దుని అద్దాడు ◆

**ఉద్యోగం**

"ఉద్యోగం వచ్చే అవకాశాన్ని వదులుకున్నావేమిటోయ్???"

"నేను నిరుద్యోగ సంఘానికి అధ్యక్షుడ్ని కదా! నేను ఉద్యోగం చేయడం ఏం బాగుంటుంది చెప్పండి!!!"

— షేక్ కరీముల్లా (బాపట్ల)